# ప్రభాత సూర్యుడు
తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 49, EDITOR:CHERUKU UPENDAR, DATE : SATURDAY 10 JUNE 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 49, ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శనివారం 10 జూన్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## 'బిపర్‌జోయ్' తీవ్రరూపం..!

**ఐదు రోజులపాటు భారీ వర్షాలు**



ముంబై– ప్రభాత సూర్యుడు

అరేబియా సముద్రంలో ఏర్పడిన 'బిపర్‌జోయ్' తుపాను తీవ్ర రూపం దాల్చనుంది. రాబోయే 36 గంటల్లో ఉత్తర వాయువ్య దిశగా కదలనుందని భరాత వాతావరణ శాఖ శుక్రవారం పేర్కొంది. ప్రస్తుతం గోవా, ముంబాయ్‌కి

మిగతా 2లో...

### వివేకా కేసులో

## సీబీఐ అప్‌డేట్

**అవినాష్ రెడ్డి ఏ-8 నిందితుడని కోర్టులో కౌంటర్ !**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో .. ఎంపీ అవినాష్ రెడ్డిని నింది తుడిగా చేర్చింది సీబీఐ. ఇప్పటి వరకూ నింది తుడిగా ఎక్కడా చెప్ప లేదు. తొలిసారిగా ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్ ను వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన కౌంటర్ లో అవినాష్ రెడ్డిని ఎనిమిదో నిందితుడిగా చేర్చింది. హత్యకు కుట్ర, సాక్ష్యాల చెరివివేతలో కీలకంగా వ్యవహరించారని సీబీఐ కౌంటర్ లో తెలిపింది. భాస్కర్ రెడ్డికి బెయిల్ ఇస్తే.. దర్యాప్తు, సాక్షులను తీవ్రంగా ప్రభావితం చేస్తారని సీబీఐ కౌంటర్ లో తెలిపింది. భాస్కర్ రెడ్డి పులివెందులలో చాలా ప్రభావితం చేయగల వ్యక్తి అని ... ఆయనకు బెయిల్ ఇవ్వవొద్దని కోరింది. భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసినప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు చేశారని.. ఆయన బయట ఉంటే.. పులివెందుల సాక్షులు ప్రభావితమైనట్లేనని కౌంటర్ లో సీబీఐ స్పష్టం చేసింది. బెయిల్ ఇచ్చి ఎన్ని షరతులు పెట్టినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. విచారణకు సహకరిస్తున్నామని భాస్కర్ రెడ్డి

మిగతా 2లో...




## మారుతున్న మేడ్చల్ రాజకీయం

- దగ్గర పడుతున్న తెలంగాణా ఎన్నికలు
- అన్ని పార్టీల్లోనూ ఆసక్తిగా మారిన మేడ్చల్ సీటు
- టాక్ ఆఫ్ ది మేడ్చల్‌గా తీన్మార్ మల్లన్న ప్రకటన

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గరపడుతోంది. ప్రధాన పార్టీలన్నీ రేస్ గుర్రాలపై దృష్టి పెడుతుండగా? అభ్యర్థులు కూడా వారి వంతుగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అయితే ఈసారి మేడ్చల్ సీటుపై పలువురు నేతలు కన్నేయటంతో.. ఈ స్థానం టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది.ఎలక్షన్ ఏడాది కావటంతో తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.ఎన్నికలను ఎదుర్కొవటం, వ్యూహ రచన విషయంలో ప్రధాన పార్టీలన్నీ బిజీ బిజీ అవుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల మూడ్ లోకి వెళ్లిన పార్టీలన్నీ రేసు గుర్రాలపై ఫోకస్ పెంచుతున్నాయి. ఇదే సమయంలో తాజాగా కర్ణాటక ఎన్నికల ఫలితాలు రావటంతో ఇక్కడ కూడా లెక్కలు మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పార్టీ మారే వారు ఆలోచనలో పడిపోతున్నారు. ఇక పొత్తుల దిశగా ఇప్పుడిప్పుడే అడుగులు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో రాజకీయాలు హీటెక్కిపోతున్నాయి. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఓ సీటు నుంచి కొత్త వ్యక్తులు అదృష్టాన్ని పరీక్షించుకోవటానికి సిద్ధమవుతున్నారు. ఇదీ కాస్త... అన్ని పార్టీల్లో ఆసక్తిగా మారింది.మేడ్చల్.... నగర శివారులో ఉన్న అసెంబ్లీ సీటు. ప్రస్తుతం మంత్రి మల్లారెడ్డి ఇక్కడ్నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014లోనూ బీఆర్ఎస్ పార్టీనే

మిగతా 2లో...



### తెలంగాణ బీజేపీపై

## హైకమాండ్ నజర్

**టార్గెట్ 90 కోసం సంస్థాగత మార్పులు**

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ బిజెపి శాఖలో ఏం జరుగుతుంది? కొన్ని రోజులుగా రాష్ట్ర యంత్రాంగంలో ఎందుకు స్తబ్దత నెలకొంది? ఈ అంశాల మీద గత వారం రోజుల వ్యవధిలో పలు పత్రికలలో పలు రకాల కథనాలు చూస్తూ ఉన్నాం. ఏతావాతా వీటి సారాంశం ఏమిటంటే కర్ణాటక ఓటమి గుణపాఠంతో తెలంగాణ నాయకత్వాన్ని బిజెపి అధినాయకత్వం

మిగతా 2 లో...

### 25న ఖమ్మంలో

## కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ

- హాజరుకానున్న ప్రియాంక గాంధీ
- ప్రణాళికబద్ధంగా పావులు కదుపుతున్న కాంగ్రెస్ అధిష్టానం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని హస్తం పార్టీ ఇచ్చినా.. కొట్లాడి తెచ్చింది మాత్రం నేనేనంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్ బహిరంగంగానే ప్రకటించారు. అలా ఆయన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన క్రెడిట్ కొట్టేసి.. వరుస ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలో కొనసాగుతున్నారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి కూడా ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించడానికి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అయితే తెలంగాణలో కేసీఆర్ రాజకీయానికి సంపూర్ణంగా చెక్ పెట్టేందుకు ఢిల్లీ నుంచి తెలంగాణ గల్లీలోని హస్తం పార్టీ నేతల వరకు అంతా ప్రణాళికబద్ధంగా పావులు కదుపుతున్నారు. ఆ క్రమంలో ఈ నెల 25వ తేదీన ఖమ్మం నగరంలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ సన్నాహాలు చేపట్టింది. అదీకాక ఇదే ఉమ్మడి జిల్లాలోని మధిర

మిగతా 2లో...

### నాంపల్లిలో

## చేప ప్రసాదం పంపిణీ




హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు గ్రౌండ్‌కు చేరుకున్న మంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రసాదం కోసం రెండు లక్షల మంది వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దానికి

మిగతా 3లో...

### ప్రతి పార్టీలో ఇద్దరు...

## పటాన్ చెరువులో ఆసక్తికరం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఎన్నికల టైం దగ్గర పడుతున్న వేళ తెలంగాణ రాజకీయాలు హీట్ ను పుట్టిస్తున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు రేసు గుర్రాలపై ఫోకస్ పెట్టగా? పలుచోట్ల పోటీ ఆసక్తిని రేపుతోంది. ఎన్నికల ఏడాది కావటంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలలోని నేతలు టికెట్లపై లెక్కలు వేసుకుంటున్నారు. తేడా అనిపిస్తే చాలు... స్వరాలు మార్చేస్తున్నారు. ఇప్పటికే అసమ్మతి నేతలు... పక్క పార్టీల వైపు చూస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ను ఢీకొట్టేందుకు ప్రతిపక్షాలు కూడా ఏకతాటిపైకి వస్తున్నాయన్న టాక్ కూడా వినిపిస్తోంది. ఇదిలా ఉంటే... ప్రధాన పార్టీలన్నీ గెలిచే రేసు గుర్రాలపై దృష్టిపెట్టాయి. చాలా చోట్ల ఒకరిద్దరు నేతలు టికెట్ రేసులో ఉండటంతో... సీన్ ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో ఉన్న పటాన్ చెరులో పొలి టికల్ వార్ గట్టిగా నడుస్తోంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో ఈ సీటు నుంచి ఎవరు గెలుస్తారన్న చర్చ వినిపిస్తోందిపటాన్

మిగతా 3లో...

## సొమ్ము తెలంగాణది సోకు కేంద్రానిది

**రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య మంత్రి హరీశ్ రావు**



సిద్దిపేట – ప్రభాత సూర్యుడు

సిద్దిపేటలో నిర్వహించిన సంక్షేమ దినోత్సవంలో బిజెపి పై మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. బిజేపీ వాళ్ల పరిస్థితి ఎట్ల ఉందంటే, మందికి పుట్టిన బిడ్డ మాదే అంటున్నరు. నేషనల్ మెడికల్ కమిషన్ 9 ప్రభుత్వ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. నాలుగు ప్రైవేటు మెడికల్ కాలేజీలకు అనుమతి ఇచ్చింది. ఎన్ ఎం సి ఇదొక అటానమస్ బాడీ. అన్ని ఉన్నయా చూసి అనుమతి ఇస్తరు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో పాటు, నాలుగు ప్రైవేటు కూడా మేమే అనుమతి ఇచ్చినం అని డబ్బ కొడుతున్నరు.. 500 కోట్లతో మేము ఒక్కో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, రాత్రింబవళ్లు కష్టపడితే మేమే చేసినం అంటున్నరు. ఇంత దుర్మార్గమా, ఇంత దారుణమా. ఇందులో ప్రాధాని పాత్ర ఏంటి, మనుసుక్ మాండవీయ పాత్ర ఏంటి, కేంద్రం పాత్ర ఏంటి, నీ పాత్ర ఎంటని ప్రశ్నించారు. తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇచ్చారా, ఒక్క పైసా అయినా ఇచ్చారా. 157 మెడికల్ కాలేజీలు ఇస్తే, తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదు, మొండి చేయి చూపారు. సొమ్ము తెలంగాణది సోకు కేంద్రానిది. మేము కాలేజీ పెట్టినం అని బండి సంజయ్ అంటుండు. ఏనాడైనా కరీంనగర్ కు మెడికల్ కాలేజీల కావాలని మాట్లాడావా, దరఖాస్తు పెట్టినవా. మేమే తెచ్చినం అని చెప్పేందుకు సిగ్గు ఉండాలి. ఇచ్చిన ఒక్క ఎయిమ్స్ అభివృద్ధి దిక్కులేదు. మేము తెచ్చుకున్న 21 మెడికల్ కాలేజీలు మాయే అన్నట్లు మాట్లాడితే ప్రజలు నవ్వి పోతరు.

మిగతా 2లో...

### కర్ణాటక ఫలితాలే

## తెలంగాణలో రిపీట్

- సెప్టెంబర్ 17న కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల
- ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి వెళ్తాం.. రేవంత్ రెడ్డి



హైదరాబాద్–ప్రభాత సూర్యుడు

కర్ణాటక ఫలితాలే తెలంగాణలో రిపీట్ అవుతాయన్నారు తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి. శుక్రవారం ఆయన కత్రియ హోటల్ వద్ద మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 17న మేనిఫెస్టో విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అభయ హస్తం పేరుతో ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి

మిగతా 3లో...

### 25న ఖమ్మంలో

# కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభ్యుడు మల్లు భట్టి విక్రమార్క.. పీపుల్స్ మార్చ్ పేరుతో చేపట్టిన పాదయాత్ర ముగియనుంది. ఈ సందర్భంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీలు వస్తారని అంటున్నారు. రాహుల్ వచ్చినా రాకున్నా ప్రియాంకా గాంధీ మాత్రం పక్కాగా ఈ సభకు వచ్చే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ శ్రేణులు గట్టిగా చెబుతున్నాయి. ఎందుకంటే.. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అక్కడి ఓటర్లు స్పష్టమైన మెజార్టీ కట్టబెట్టారు. అదే విధంగా ఈ ఏడాది చివరిలో జరగనున్న వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ప్రియాంకా గాంధీ సుడిగాలి పర్యటనలు చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అందులోభాగంగా మధ్యప్రదేశ్‌లోని జబల్ పూర్‌లో ఈ నెల 12వ తేదీన ఆమె ప్రచార ఘట్టానికి శ్రీకారం చుట్టున్నారని... ఆ క్రమంలో ఖమ్మం వేదికగా జరిగే సభలో పాల్గొంటారని సమాచారం. మరోవైపు ఇదే వేదికపైన .. అదే జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొల్హాపూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులు హస్తం గూటికి చేరనున్నారని తెలుస్తోంది. ఇంకోవైపు జూన్ 11 లేదా 12వ తేదీన ఢిల్లీలోని హస్తం పార్టీ అధిష్టానంతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని ముఖ్య నాయకులు భేటీ అయి.. రాష్ట్రంలో పార్టీ విజయం కోసం అమలు చేయాల్సిన అంశాలు.. అలాగే ప్రజల్లోకి ఏ ఏ అంశాలు బలంగా తీసుకు వెళ్లాలి తదితర అంశాలతోపాటు పలు కీలక అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు తెలంగాణలో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. అలాగే ప్రియాంక గాంధీ సైతం.. తెలంగాణలో పాదయాత్ర నిర్వహించే అవకాశం ఉందనే చర్చ సైతం జరుగుతోంది.ఇక తెలంగాణలో పీసీసీ పగ్గాలు రేవంత్ రెడ్డి చేపట్టిన తర్వాత.. పార్టీ ప్రజల్లోకి బలంగా వెళ్తుందని.. అందుకు ఆయన చేపడుతోన్న సభలు, బహిరంగసభకు భారీగా ప్రజలు పోటెత్తుతోన్న సంగతి తెలిసిందే. అయితే రానున్న తెలంగాణ ఎన్నికలు మాత్రం చాలా రసవత్తరంగా మారనున్నాయనేది సుస్పష్టమని తెలంగాణలోని పొలిటికల్ సర్కిల్‌లో చర్చ అయితే ఇప్పటికే ఊపందుకొంది. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో కూడా వరుసగా గెలిచి.. ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి పీఠం అధిష్టించాలని కారు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. అయితే కేసీఆర్ పాలనకు చెక్ పెట్టి దక్షిణాదిలో.. అదీ తెలంగాణలో పాగా వేసి... తమ సత్తా చాటుకోవాలని బీజేపీలోని కాషాయం పార్టీ నేతలు... తమ వ్యూహాలకు పదును పెడుతూ.. ఈ రాష్ట్రంలో గెలుపు కోసం తమ వంతు ప్రయత్నాలకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. అయితే రాష్ట్ర విభజనతో ఆంధ్రాలో పార్టీ పరిస్థితి పాతాళంలోకి పడిపోతోందని తెలిసినా.. తెలంగాణలో మాత్రం అధికారం నిలుపుకుంటామని.. హస్తం పార్టీ అధిష్టానం కలలు కన్నది. కానీ ఆ కలలను... నాటి టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కల్లలు చేశారు. దీంతో తమ పార్టీ అధిష్టానం కన్న కలను సాకారం చేసేందుకు తమ వంతు ప్రయత్నాన్ని అయితే హస్తం పార్టీ నేతలు శ్రీకారం చుట్టారు. మరోవైపు రాష్ట్ర విభజన సమయంలో జరిగిన ఎన్నికల్లో సైతం సత్తా చాటిన తెలుగుదేశం.. 2019 ఎన్నికల్లో మాత్రం అంతగా సత్తా చాట లేకపోయింది. అయితే టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా అవతరించిన తర్వాత.. తెలంగాణలో టీడీపీ సైతం సూపర్ స్పీడ్‌తో సైకిల్ సవారీ చేస్తుంది. ఆ క్రమంలో 2022 డిసెంబర్‌లో తెలంగాణ టీడీపీ ఆధ్వర్యంలో ఖమ్మం వేదికగా నిర్వహించిన శంఖారావ సూపర్ సక్సెస్ అయింది. ఆ తర్వాత అంటే 2023, జనవరిలో కారు పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సైతం ఖమ్మంలో భారీ సభ చేపట్టి గ్రాండ్ సక్సెస్ అయ్యారు. అయితే మరికొద్ది రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సైతం ఖమ్మం వేదికగా సభ నిర్వహించి.. సత్తా చాటనుంది. మరి అలాంటి వేళ.. కాషాయం పార్టీ నేతలు సైతం....ఖమ్మం వేదికగా.. సభ నిర్వహించినా నిర్వహించవచ్చుననే అభిప్రాయం సైతం పొలిటికల్ సర్కిల్‌లో ఓ టాక్ అయితే హల్ చల్ చేస్తోంది. అన్ని పార్టీలు ఇలా ఖమ్మం వేదికగా.. బహిరంగ సభలు నిర్వహించినా.. ఓటర్లు మాత్రం ఒకే ఒక్క పార్టీకే మేజార్టీ స్థానాలు కట్టబెతారనేది సుస్పష్టం.

# 'బిపర్‌జోయ్' తీవ్రరూపం..!

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ నైరుతి దిశలో కేంద్రీకృతమై ఉంది. 135 నుంచి 145 కిలోమీటర్ల వేగంతో ద్రోణి కదులుతోంది. దీంతో రానున్న 5 రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెల్పింది. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మత్స్యకారులను సముద్రంలో వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ తుఫాను హెచ్చరికలు జారీ చేసింది. ఇక ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన వారు తీరానికి తిరిగి రావాలని సూచించింది.జూన్ 8న రాత్రి 11:30 గంటల సమయం నాటికి.. తూర్పు-మధ్య అరేబియా సముద్రం మీదుగా కదులుతోన్న ద్రోణి గోవాకు పశ్చిమ-నైరుతి దిశలో 840 కిలోమీటర్లు, ముంబైకి పశ్చిమ-నైరుతి దిశలో 870 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు వాతావరణ శాఖ తెల్పింది. దీని ప్రభావంతో వచ్చే 2 రోజుల్లో వాతావరణం భీతావాహకంగా ఉండే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. మరోవైపు 'బిపర్‌జోయ్' తుపాను ప్రభావంతో గురువారం రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకడంతో దేశంలో వర్షాకాలం ప్రారంభమైంది. సాధారణ ఈ సీజన్‌లో జూన్ 1న రావల్సిన రుతుపవనాలు.. జూన్ 8న ప్రవేశించాయి. ఆదివారం నాటికి రుతుపవనాలు బెంగాల్‌కు చేరుకుంటాయి. ఆది, సోమవారాల్లో హౌరా, కోల్‌కతా, హుగ్లీ వంటి తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం అంచనా వేసింది

# మారుతున్న మేడ్చెల్ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడ గెలిచింది. అయితే 2018లో జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా సుధీర్ రెడ్డిని తప్పించి... మల్లారెడ్డికి అవకాశం ఇచ్చారు. ఈ సీటు నుంచి గెలిచిన ఆయన... ప్రస్తుతం కేబినెట్ లో కూడా ఉన్నారు. అయితే ఈ సీటుపై ప్రధాన పార్టీలు ఈసారి భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఎలాగైనా మల్లారెడ్డిని ఓడించి తీరాలని చూస్తున్నాయి. ఇక బీఆర్ఎస్ నుంచి మరోసారి టికెట్ ఆశిస్తున్నారు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి. వీరి మధ్య ఆధిపత్య పోరు కూడా తీవ్రస్థాయికి చేరుకుంది. ఈ పరిణామం కాస్త బీఆర్ఎస్ లో తీవ్ర అసంతృప్తికి ఆజ్యంపోసినట్లు అయింది. ఇక మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గానికి ఏం చేయలేదన్న వాదనను తెరపైకి తీసుకువస్తున్నారు సుధీర్ రెడ్డి. ఆయన కుమారుడు ప్రస్తుతం మేడ్చల్ జిల్లా జెడ్పీ ఛైర్మన్ గా ఉన్నారు. ఇప్పటికే పార్టీ... రెండు వర్గాలుగా విడిపోయింది. వీరిద్దరిలో ఎవరికి టికెట్ దక్కుతుందన్న చర్చ గట్టిగా ఉంది. అయితే మల్లారెడ్డికి అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయన్న టాక్ గట్టిగా వినిపిస్తోంది. అయితే చివరికి ఏం జరగుతుందనేది చూడాలి.ఇక మంత్రి మల్లారెడ్డి వైఫల్యాలను బలంగా ప్రశ్నిస్తున్నా ప్రతిపక్షాలు.... మేడ్చల్ సీటుపై కన్నేశాయి. వ్యాపారం సామ్రాజ్యం విస్తరణ, భూకబ్జాలు అంటూ ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఇదే టైంలో మేడ్చల్ లో ఈసారి గెలుచుకోవాలని చూస్తున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ దూకుడుగా వెళ్తోంది. కాంగ్రెస్ నుంచి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డితో పాటు తోటకూర జంగయ్య యాదవ్ పోటీ పడుతున్నారు. ఎవరికి వారుగా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఇక ఇదే సీటుపై బీజేపీ కూడా భారీగానే ఆశలు పెట్టుకుంది. సెమీ అర్బన్ ఏరియా కావడంతో తమకు లాభిస్తోందని అంచనా వేస్తోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పట్లోళ్ల విక్రమ్ రెడ్డితో పాటు కొంపల్లి మోహన్ రెడ్డి రేసులో ఉన్నారు. వీరిద్దరూ టికెట్ కోసం పోటీ పడుతుండగా... గత కొంత కాలంగా ఈటల రాజేందర్ పేరు కూడా వినిపిస్తోంది. ఆయన వచ్చే ఎన్నికల్లో హుజురాబాద్ నుంచి కాకుండా.... మేడ్చల్ నుంచి పోటీ చేస్తారన్న టాక్ వినిపిస్తోంది.

అదే జరిగితే... మేడ్చల్ రాజకీయం మరోలా ఉంటుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ఇక బీఎస్పీ, వైఎస్ఆర్టీపీతో పాటు మిగతా పార్టీలు కూడా సన్నద్ధం అవుతున్నాయి. అయితే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటి అందర్నీ ఆకర్షించిన తీన్మార్ మల్లన్న(చింతపండు నవీన్ కుమార్) ఇక్కడ్నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ ప్రకటన కాస్త టాక్ ఆఫ్ ది మేడ్చల్ గా మారింది. మొత్తంగా గెలుపు లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్న నేపథ్యంలో... విజయం ఎవర్ని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# సొమ్ము తెలంగాణది సోకు కేంద్రానిది

(మొదటి పేజీ తరువాయి)

ఇంత కంటే అన్యాయం ఉండదు. చేయని దాన్ని చేసినం అని చెప్పుకుంటున్నందుకు తలదించుకోవాలి. భేషరతుగా క్షమాపణ చెప్పాలి. దమ్ముంటే అవి ఇప్పించేందుకు పోరాటం చేయు. ఇప్పించి ప్రచారం చేసుకోవాలని అన్నారు.

**ఓపెనింగ్ కు సిద్ధంగా సిద్ధిపేట ఐటీ హబ్**

నియోజకవర్గ స్థాయి యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేసీఆర్ సర్కారు సిద్ధిపేటలో ఐటీ హబ్ ఏర్పాటు చేసిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు చెప్పారు. జిల్లా కేంద్రమైన సిద్ధిపేట శివారులో నిర్మిస్తున్న ఐటీ హబ్ ను శుక్రవారం ఉదయం ఏంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవిలతో కలిసి ఐటీ టవరులోని ప్రతీ ఫ్లోర్ కలియ తిరుగుతూ సందర్శించి జిల్లా కలెక్టర్, టీఎస్ఐఐసీ అధికారులతో ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రి సమీక్ష జరిపారు. అత్యాధునిక సదుపాయాలతో నిర్మిస్తున్న ఐటీ హబ్ భవనాన్ని ఈ నెల జూన్ 15వ తేదీన రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. దీంతో ప్రత్యక్షంగా 750 మంది స్థానిక యువతకు, పరోక్షంగా మరికొంత మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ జూన్ నెల 13వ తేదీన సిద్ధిపేట పోలీసు కన్వెన్షన్ హాల్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ సదవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వివేకా కేసులో సీబీఐ అప్ డేట్

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్నారని..కానీ అదంతా అబద్దమన్నారు. శివశంకర్ రెడ్డి ఫోన్ చేసిన నిమిషంలోపే అవినాష్ రెడ్డి హత్యాస్థలానికి చేరుకున్నారని అంతకు ముందే .. గంగిరెడ్డి, శివంకర్ రెడ్డి , అవినాష్ రెడ్డి మాట్లాడుకున్నారని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చారన్నారు. కేసు పెట్టవద్దని.. వివేకా మృతదేహానికి పోస్టుమార్టం వద్దని సీఐ శంకరయ్యకు అవినాష్ , శివశంకర్ రెడ్డి చెప్పారన్నారు. సీబీఐ , కోర్టుకు ఏమీ చెప్పవద్దని దస్తగిరిని ప్రలోభపెట్టారని సీబీఐ తెలిపింది. వివేకా హత్య కేసులో భారీ కుట్ర ఉందని దానిపై దర్యాప్తు చేస్తున్నామని సీబీఐ తెలిపింది. హైకోర్టులో అవినాష్ రెడ్డి బెయిల్ పిటిషన్ ను వ్యతిరేకిస్తూ.. దాఖలు చేసిన కౌంటర్ లో సీబీఐ సీఎం జగన్ ప్రస్తావన తీసుకు వచ్చింది. వైఎస్ వివేకా హత్యకు గురయ్యారని బయట ప్రపంచానికి తెలియక ముందే .. సీఎం జగన్ తెలుసని కౌంటర్ దాఖలు చేసింది. తాజాగా సీబీఐ కోర్టులోనూ చెప్పింది. దీంతో మరోసారి జగన్ ప్రస్తావనను సీబీఐ తెచ్చినట్లయింది. భాస్కర్ రెడ్డి తరపున న్యాయవాది ఉమా మహేశ్వర్ రావు వాదనలు వినిపించారు. భాస్కర్ రెడ్డి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇదే కేసులో అవినాష్ రెడ్డికి హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ తీర్పును న్యాయవాది ప్రస్తావించారు. వివేకా హత్య కేసులో ఎలాంటి సంబంధం లేని వ్యక్తిని సీబీఐ అధికారులు ఆరెస్ట్ చేశారని న్యాయవాది ఉమా మహేశ్వర్ రావు అన్నారు. ఆరోపణలు మాత్రమే సీబీఐ పరిగణలోకి తీసుకుందని, భాస్కర్ రెడ్డి సమాజంలో పలుకబడి ఉన్న వ్యక్తి అని, ఒక సీనియర్ సిటిజన్‌ను అక్రమ కేసులో ఇరికించారన్నారు. ఎలాంటి నేర చరిత్ర లేనటువంటి వ్యక్తి భాస్కర్ రెడ్డి అని, ఆయన నేరం చేశారనడానికి ఎక్కడా సరైన సాక్ష్యాలు లేవన్నారు. ఎర్ర గంగిరెడ్డి ఎక్కడ కూడా భాస్కర్ రెడ్డి పేరు ప్రస్తావించలేదని అన్నారు. ఈ కేసు విషయంలో ఇంప్లీడ్ అయ్యేందుకు గతంలో వైఎస్ సునీత పిటిషన్ దాఖలు చేశారు. సునీత ఇంప్లీడ్ పిటిషన్ ను న్యాయమూర్తి అంగీకరించారు. అయితే లిఖిత పూర్వక వాదనలు సమర్పించాలన్నారు. తదుపరి విచారణను తొమ్మిదో తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

# తెలంగాణ బీజేపీపై హైకమాండ్ నజర్

(మొదటి పేజీ తరువాయి)

మార్చబోతోంది అన్నది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఓటమి నేపథ్యంలో బిజెపి హై కమాండ్ తెలంగాణ మీద ప్రత్యేకంగా దృష్టి సారించింది. కర్ణాటకలో ఏవైతే తప్పులు జరిగాయో అవి తెలంగాణలో పునరావృతం కాకుండా జాగ్రత్త పడే దిశగా అడుగులు వేస్తుంది. నవంబర్ లేదా డిసెంబర్ నెలలో జరగబోతున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో విజయ అవకాశాలు దెబ్బతినకుండా సంస్థాగతంగా మార్పులు చేసే అవకాశాలపై కమలనాథులు దృష్టి సారించినట్లు తెలుస్తుంది. రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న బండి సంజయ్‌కు జాతీయస్థాయిలో వేరే పదవిని ఇచ్చి.. అధ్యక్షునిగా వేరొకరిని నియమిస్తారని ప్రచారం కూడా జరుగుతుంది. అయితే దీనికి అవకాశాలు తక్కువేనని చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నాలుగు నెలల మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో అధ్యక్షుని మార్పు కచ్చితంగా వికటించే ప్రయోగమే అవుతుందని కమలనాథులకు బాగా తెలుసు. అయితే, అసంతృప్తినేతలను ఎలా సంతృప్తి పరుస్తారు? ఎలా దారిలోకి తెచ్చుకుంటారు? అన్నదే ఇప్పుడు కీలకంఅయితే, స్థానిక నాయకత్వ మార్పు కోసం ఇది తగిన సమయమా కాదా అన్నది కూడా లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు మిగిలింది నాలుగు నెలల కాలమే. ఈ నాలుగు నెలల వ్యవధిలో కమలనాథులు కొత్త ప్రయోగాలు చేస్తారా అన్నది సందేహమే. చివరి నిమిషంలో చేసే ప్రయోగాలు వికటించే అవకాశాలే ఎక్కువ. ఆ విషయం సుదీర్ఘ రాజకీయ అనుభవం.. వ్యూహరచనలో ఆరితేరిన నాయకత్వం కలిగిన బిజెపికి బాగానే తెలిసి ఉంటుంది. మరి తెలంగాణ బిజెపి పగ్గాలను మార్చేందుకు బిజెపి అధినాయకత్వం మొగ్గు చూపుతోందా లేక అసంతృప్త నేతలను దారిలోకి తీసుకురావడానికి ఇంకేదైనా వ్యూహరచన చేస్తుందా అన్నది చూడాల్సి ఉంది. నిజానికి బీజేపీ అధినాయకత్వానికి ఇది చాలా ట్రికీ సిచ్యుయేషన్ అని చెప్పాలి. ఎన్నికలకు ముందు ప్రచార కమిటీ, మ్యానిఫెస్టో కమిటీ.. ఇలా రకరకాల కమిటీలను రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకుంటాయి. అదే కోణంలో ప్రచార కమిటీకి సారథ్య బాధ్యతలు వహించడం అనేది రాజకీయ నాయకులకు ప్రతిష్టాత్మకమైన విషయం. ఇప్పుడు తెలంగాణ బిజెపిలో ఆ పదవి కీలకంగా మారినట్లు కనిపిస్తుంది. ఏడాదికాలంగా చేరికల కమిటీ కన్వీనర్ గా ఉంటూ వస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్ తెలంగాణ బిజెపి సారథి కావాలని అనుకుంటున్నారు. ఆయనకు క్యాంపెయిన్ కమిటీ ఛైర్మన్ పదవి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సాధారణంగా సంఘపరివార్ అండా దండాలేని వ్యక్తులను పార్టీ అధ్యక్షునిగా నియమించడం బిజెపిలో అత్యంత అరుదైన అంశం. బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడు అయిన తర్వాత పార్టీ యంత్రాంగాన్ని ఉరుకులు పెట్టించారు. పలు ఉప ఎన్నికలలో సానుకూల ఫలితాలు సాధించారు. మరీ ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులలో కొత్త ఉత్సాహాన్ని విప్పారు. ఈ అంశాలన్నీ బాగానే ఉన్నా ఇవి వచ్చే ఎన్నికల్లో విజయానికి సరిపోవు అని కొందరు అధినాయకత్వానికి నూరిపోయడంతో ప్రస్తుతం బిజెపి అధినాయకత్వం ఆలోచనలో పడింది. సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకొని సంస్థకతంగా కొన్ని మార్పులను చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.తెలంగాణ బిజెపిలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పార్టీ హైకమాండ్ సీరియస్‌గానే అబ్జర్వ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీలో వినిపిస్తున్న అసమ్మతి రాగాలకు చెక్ పెట్టాలని హై కమాండ్ భావిస్తున్నట్లు ఢిల్లీ వర్గాల భోగట్టా. నేతలపై చర్యలు తీసుకోవాలని కూడా కొంతమంది ప్రతిపాదిస్తున్నట్లు తెలుస్తోంది.ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పార్టీలో ఇప్పుడు చోటుచేసుకుంటున్న పరిణామాల పట్ల అధినాయకత్వం సీరియస్‌గా ఉన్నట్టు కొంతమంది చెబుతున్నారు. కర్ణాటక ఫలితాలకు ముందు తెలంగాణలో కెసిఆర్‌ను గద్దె దింపేది బిజెపి పార్టీనేనని చాలామంది భావించారు. అదే ఆలోచనతో చాలామంది పార్టీలో చేరారు కూడా. నిజానికి చేరికల కమిటీ కన్వీనర్‌గా ఉన్న ఈటల రాజేందర్ పెద్దగా పేరున్న నేతలను పార్టీలో చేర్పించడంలో విఫలం అయ్యారనే చెప్పాలి. ఒక అడుగు ముందుకేస్తే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విషయంలో తాను విఫలమైన సంగతిని బహిరంగంగా వెల్లడించి ఒకరకంగా శల్య ప్రకటన ద్వారా పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం నింపారనే విశ్లేషించాలి. పార్టీలో వినిపిస్తున్న అసమ్మతి రాగాలపైనా, అసంతృప్త నేతల కదలికలపైనా నివేదిక ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వాన్ని హైకమాండ్ కోరినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే హైదరాబాద్ శివారులోని పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన నందీశ్వర్ గౌడ్ బిజెపిలో .. కేసీఆర్ కోవర్టులు ఉన్నారంటూ పెద్ద బాంబు పేల్చారు. ఈ కోవర్టులు తమ విధానాలను మార్చుకోకపోతే 15 రోజులలో వారి పేర్లను బహిర్గత పరుస్తారని కూడా హెచ్చరించారు. ఇదంతా ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరడానికి చేస్తున్నారని కొంతమంది అన్నా కూడా ఆయన వెనక్కి తగ్గలేదు. తాను బిజెపిని వీడేది లేదంటూనే మరోసారి కోవర్టులకు వార్నింగ్ ఇచ్చారు నందీశ్వర్ గౌడ్. ఇక తాజా పరిణామాల మీద రాష్ట్ర బిజెపి అంతర్గత సమీక్షకు పూనుకున్నట్లు తెలుస్తోంది. కొంతమంది నాయకులు ప్రత్యేక సమావేశాలను నిర్వహించుకుంటూ "ఏదైనా సమస్య ఉంటే పార్టీ వేదికపైనే లేవనెత్తాలి.. కానీ బహిరంగ ప్రకటనలకు దిగరాదు" అన్న ఇండికేషన్ ఇచ్చారు. నలుగురు జాతీయ కార్యవర్గ సభ్యులు, ఇద్దరు మాజీ ఎంపీలు ఇటీవల భేటీ అయి ఈటల కదలికలపై విశ్లేషణ జరిపినట్లు తెలుస్తోంది. మరీ ముఖ్యంగా మొదటి నుంచి బిజెపిలో ఉన్నవారికి.. గత రెండేళ్ల కాలంలో బిజెపిలో చేరిన వారికి పొసగకపోవడం ఇప్పుడు తెలంగాణ బిజెపికి ఇబ్బందికరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలకు ఎంతో సమయం లేని పరిస్థితిలో ఇలాంటి పరిణామాలు సహజంగానే బిజెపి హై కమాండ్‌కు తలనొప్పిగా మారతాయి. ఇక్కడ ఇంకో అంశం ప్రధానంగా కనిపిస్తుంది. వరుస పాదయాత్రలతో దాదాపు ఏడాదిపాటు బండి సంజయ్ పార్టీ యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించారు. ఇలా అయిదు దశల పాదయాత్రను బండి సంజయ్ పూర్తి చేసుకున్నారు. చివరి రెండు పాదయాత్రలకు పార్టీ అధినాయకత్వం, కేంద్ర మంత్రులు హాజరై పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కేసీఆర్‌ని గద్దె దింపే సరైన ప్రత్యామ్నాయం బిజెపినేనని చాటేందుకు ప్రయత్నం చేశారు. ఆరో విడత పాదయాత్రకు బండి సంజయ్ సిద్ధమైతే ఆయన పాదయాత్రకు కొందరు మోకాలడ్డినట్టు తెలుస్తోంది. నిజానికి బండి సంజయ్ పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రకమైన పాదయాత్రలు ఇతర రాష్ట్రాలలో కూడా చేయాలని సూచించారు. బండి సంజయ్ పొంగిపోయారు. కానీ తీరా ఆయన ఖమ్మం నుంచి ఆరో విడత ప్రజా సంక్రమ యాత్ర ప్రారంభించాలని సంకల్పిస్తే కొందరు అధినాయకత్వం మీద ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఈ యాత్రకు బ్రేక్ పడేట్టు చేసినట్టు పార్టీ శ్రేణులు చెప్పు కుంటున్నాయి. ఇలా ఈ యాత్రకు బ్రేక్ వేయడం పరోక్షంగా తెలంగాణ బిజెపి శ్రేణుల ఉత్సాహం మీద నీళ్లు చల్లినట్లు అయిందని తాజాగా బిజెపి హై కమాండ్ గుర్తించినట్లు ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఒకరు మీడియాతో చిట్ చాట్ మాట్లాడుతూ వెల్లడించడం విశేషం.

## సంపాదకీయం

# నితీశ్ ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు

సార్వత్రిక ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. వరుసగా మూడోసారి అధికార పగ్గాలు సొంతం చేసుకోవాలని కమలనాథులు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వస్తాయని.. బీజేపీ గద్దె దిగడం ఖాయమని అమెరికా పర్యటనలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధీమా వ్యక్తంచేశారు. బీజేపీని ఇంటికి సాగనంపే సత్తా ప్రతిపక్ష కూటమికి ఉందన్న ఆయన.. దీనికి సంబంధించి అన్ని ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమి ఏర్పాటుకు సంబంధించి కాంగ్రెస్ నేతలతో పాటు ఇతర విపక్ష నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బీజేపీయేతర పార్టీలను ఏకంచేసేందుకు బీహార్ సీఎం నితీశ్ కుమార్ తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. గత నెల ముంబయిలో పర్యటించిన నితీష్.. ఎన్సీపీ అధినేత శరద్ పవార్, శివసేన(ఉద్ధవ్ వర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేలను కలిశారు. అలాగే కోల్‌కతాలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, లక్నోలో అఖిలేష్ యాదవ్‌లను నితీష్ కుమార్ కలిశారు. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిపై వారితో చర్చించి.. పాట్నాలో నిర్వహించే ప్రతిపక్ష పార్టీల సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానించారు. అటు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోనూ సమావేశమై ప్రతిపక్ష కూటమి ఏర్పాటుపై చర్చించారు. నితీష్ కుమార్ వెంట ఆర్జేడీ నేత, బీహార్ డిప్యూటీ సీఎం తేజస్వి ప్రసాద్ యాదవ్ కూడా ప్రతిపక్ష నేతలను కలిశారు. ఐక్య విపక్ష కూటమి ఏర్పాటు దిశగా మరో ముందడుగు పడనుంది. పాట్నాలో నితీష్ నిర్వహించనున్న ప్రతిపక్ష పార్టీల ఐక్యతా సమావేశానికి ముహూర్తం ఖరారయ్యింది. జూన్ 23న నీతీష్ కుమార్ నిర్వహించనున్న ఈ సమావేశానికి.. వీలయినంత ఎక్కువ పార్టీలను ప్రతిపక్ష కూటమి కిందకు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, ఢిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు హాజరవుతారని తెలుస్తోంది.ముందుగా జూన్ 12న ఈ సమావేశాన్ని పాట్నాలో నిర్వహించాలని జేడీయు, ఆర్జేడీ నేతలు భావించారు. అయితే తమను సంప్రదించకుండానే తేదీని ఖరారు చేయడంపై కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తంచేయడంతో ఈ సమావేశాన్ని వాయిదావేశారు. ఈ సమావేశాన్ని జూన్ 23న నిర్వహించాలని నిర్ణయించినట్లు పాట్నాలో తేజస్వి యాదవ్ వెల్లడించారు. ఈ సమావేశంలో యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, వామపక్ష సీనియర్ నేతలు డీ రాజా, సీతారాం ఏచూరీ, దీపన్‌కర్ భట్టాచార్య తదితరులు కూడా పాల్గొంటారని తేజస్వి యాదవ్ తెలిపారు.బీహార్‌లో బీజేపీని గద్దె దించేందుకు ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి మహాకూటమి ఏర్పాటు చేయడంలో తన తండ్రి, ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, సీఎం నితీశ్ కుమార్ విజయం సాధించారని తేజస్వి యాదవ్ కొనియాడారు. ఇదే తరహాలో జాతీయ స్థాయిలోనూ బీజేపీయేతర పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఇప్పుడు పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యానికి బీజేపీ పాతరవేస్తోందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే విపక్షాలను ఏకం చేస్తున్నట్లు తెలిపారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి గట్టిపోటీ ఇచ్చే అంశంపై విపక్ష నేతలు చర్చించనున్నారు. బీజేపీ వ్యతిరేక ఓటు విపక్షాల మధ్య చీలిపోతే బీజేపీ గెలిచే అవకాశం ఉంటుంది.. అందుకే కనీసం 450 లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీని ఢీకొనే ప్రతిపక్ష అభ్యర్థి ఒక్కరు మాత్రమే బరిలో నిలిచేలా చూడాలని భావిస్తున్నారు. తద్వారా బీజేపీ విజయావకాశాలను అడ్డుకోవచ్చని భావిస్తున్నారు. పాట్నాలో ఈ అంశంపై ప్రతిపక్ష నేతలు ప్రధానంగా చర్చించే అవకాశముంది. ఈ ప్రతిపాదన మేరకు కాంగ్రెస్ ? బీజేపీ మధ్య ప్రధాన పోటీ ఉండే రాష్ట్రాల్లో ఇతర విపక్ష అభ్యర్థులు ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటారు. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో బీజేపీపై కాంగ్రెస్ పోటీ చేయకూడదు. దీంతో అక్కడ బీజేపీ-ప్రాంతీయ పార్టీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంటుంది. అయితే కేరళా తదితర కొన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలే ప్రధాన రాజకీయ ప్రత్యర్థులుగా ఉంటే అక్కడ ఈ అవగాహన సాధ్యంకాకపోవచ్చని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీతో వివిధ ప్రతిపక్షాలకు ఏకీభావం కుదిరే అవకాశాలు బహు తక్కువ. కొన్ని రాష్ట్రాల్లో అది సాటి ప్రతిపక్షాలను ఎదుర్కోవలసి వుంటుంది. కాంగ్రెస్ లేకుండా మిగతా ప్రతిపక్షాలన్నీ ఒక్క త్రాటి మీదికి వస్తే ఎలా వుంటుందనే అంశం మీద కూడా చర్చ చాలానే జరిగింది. అది ఆశించిన ప్రయోజనం కలిగించబోదనే భయాలున్నాయి. ఎందుకంటే కాంగ్రెస్ అధికారంలో వున్నా లేకపోయినా ఎక్కువ రాష్ట్రాల్లో ఉనికిని కలిగి వుంది. గతంలో మాదిరిగా ఈసారి కూడా ఒంటరిగానే బిజెపితో పోరాడి కేంద్రంలో మళ్ళీ ఏకైక అధికార పక్షంగా చక్రం తిప్పుదామనే కోరిక దానిలో లేకపోలేదు. మొన్నటి కర్ణాటక విజయం తర్వాత అది ఇంకా పెరిగి వుండవచ్చు. కాని మతతత్వ బలంతో ఉత్తరాదిలో బాగా వేళ్ళూనుకొన్న బిజెపిని కాంగ్రెస్ ఒంటరిగా ఓడించడం తేలిక కాదు. అందుచేత ఐక్య ప్రతిపక్షంతో కలిసి అడుగులు వేయక తప్పని పరిస్థితిలో అది వుంది. చివరికి బిజెపి వ్యతిరేక ప్రతిపక్ష కూటమి ఏ రూపు తీసుకొంటుందో ఇప్పటికైతే ఊహకు అతీతమైన విషయమే. కాని భారతీయ జనతా పార్టీ సెక్యులర్ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక విలువలను బలి తీసుకొంటున్న తీరును గమనిస్తే దానిని మట్టి కరిపించే దిశగా ప్రతిపక్షాల మధ్య ఏ మేరకు అవగాహన కుదిరినా అది హర్షించదగినదే అనిపించడం ఆక్షేపించదగినది కాదు.

# కర్ణాటక ఫలితాలే తెలంగాణలో రిపీట్

(మొదటిపేజీ తరువాయి)

వెళ్తామని పేర్కొన్నారు.. పలు పార్టీల నేతలతో అధిష్టానం చర్చలు జరిపిందని, ప్రజలు కోరుకుంటున్న విధంగానే చేరికలు ఉంటాయని, సీఎం కేసీఆర్‌కు తన పేరు తీసే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. దమ్ముంటే తన పేరు తీయాలని ముఖ్యమంత్రికి సవాలు విసురుతున్నానన్నారు.తన భూమి వివరాల కోసం చాలా రోజుల నుంచి రంగారెడ్డి కలెక్టర్ దగ్గరకి తిరుగుతున్నానని రేవంత్ అన్నారు. గడీల పాలన పునరుద్ధరించడానికి సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చుకున్నారని విమర్శించారు. భూస్వాములను తరిమి కొట్టడానికే నక్సల్బరీ ఉద్యమం వచ్చిందని, ధరణిలో పోర్టల్ ప్రభుత్వం చేతిలో లేదని, దళారుల చేతిలోకి పోయిందని అన్నారు. ధరణి లేకపోతే రైతుబంధు రాదనడం బ్రతక్కువ పని అని మండిపడ్డారు. ధరణి మోసాల వల్ల కేసీఆర్ కుటుంబం చర్లపల్లి జైలుకి వెళ్తుందన్నారు. చర్లపల్లి జైలులో కేసీఆర్ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామన్నారు.బావ బామ్మర్థులు (కేటీఆర్, హరీష్ రావు) వస్తే బహిరంగంగా చర్చిదామని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలోనైనా చర్చకు సిద్దంగా ఉన్నామన్నారు. రెండు వేల రూపాయలకు రెండు ఫుట్ బాటిల్స్ కూడా రావడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబంలా ప్రజలను దోచుకోమని స్పష్టం చేశారు. సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపంపై ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష వేయిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**డబుల్ ఇంజన్ అంటే ఆదానీ, ప్రధాని రేవంత్ రెడ్డి**

శుక్రవారం జరిగిన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపాల్గోన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పోరాడే వారికే భవిష్యత్ ఉంటుంది. రాజకీయ భవిష్యత్ కు యూత్ కాంగ్రెస్ ఒక మంచి వేదిక. నాయకుడుగా మారడానికి యూత్ కాంగ్రెస్ ఒక వేదిక. ఇందుకు ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే మనకు ఉదాహరణ. 1200 మంది విద్యార్థి, యువత ప్రాణత్యాగాలతో తెలంగాణ ఏర్పడింది. డబుల్ ఇంజన్ అంటే ఆదానీ, ప్రధాని.

దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజన్ పని అని ఆరోపించారు. వన్ నేషన్ వన్ పార్టీ అనేది బీజేపీ రహస్య ఎజెండా. బీజేపీ కుట్రలను ఛేదించి దేశంలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలి. సెప్టెంబర్ 17 న కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేద్దాం. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం మీరంతా కష్టపడాలి. తెలంగాణలో కేసీఆర్ ను ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. డిసెంబర్ 9 న సోనియా జన్మదినం. తెలంగాణలో కాంగ్రెస్ ను గెలిపించి సోనియాకు కానుకగా ఇవ్వాలని అన్నారు.

## ప్రతి పార్టీలో ఇద్దరు...

# పటాన్ చెరువులో ఆసక్తికరం

(మొదటిపేజీ తరువాయి)

చెరు....నగర శివారులో ఉన్న అసెంబ్లీ సీటు. ప్రస్తుతం ఇక్కడ్నుంచి గూడెం మహిపాల్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అధికార బీఆర్ ఎస్ నుంచి రెండు సార్లు ఈ నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి కూడా పార్టీ నుంచి టికెట్ దక్కించుకొని హ్యాట్రిక్ విజయం కొట్టాలని చూస్తున్నారు. అయితే ఆయనపై సొంత పార్టీలోనే అసంతృప్తి ఉంది. అదే పార్టీకి చెందిన నీలం మధు ముదిరాజ్ టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఎమ్మెల్యేకు ధీటుగా కార్యక్రమాలు చేస్తూ అధిష్టానం దృష్టిని ఆకర్షి స్తున్నారు. ఇరువర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. ఇక్కడ ముదిరాజ్ కమ్యూనిటితో పాటు బీసీల ఓట్లు అధికంగా ఉన్న నేపథ్యంలో... తనకే టికెట్ వస్తుందని మధు ఆశలు పెట్టుకున్నారు. ఈ పరిణామం కాస్త మహిపాల్ రెడ్డికి ఇబ్బందికరంగా మారింది. పైగా ఆయనపై కబ్జా ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతిపక్షాలు కూడా ఆయనపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో గులాబీ సీటు ఎవరికి అనే దానిపై అధికారికంగా క్లారిటీ వస్తే... కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.ఇక కాంగ్రెస్ పార్టీ ఇక్కడ స్ట్రాంగ్ గా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో కట్టా శ్రీనివాస్ గౌడ్ పోటీ చేసి.... 78 వేలకు పైగా ఓట్లు సాధించారు. ఈసారి కూడా బరిలో ఉండాలని చూస్తున్నారు. ఇదే టైంలో మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయిన గాలి అనిల్ కుమార్ పటాన్ చెరుపై కన్నేశారు. ఎలాగైనా కాంగ్రెస్ నుంచి సీటు సాధించి... గెలవాలని భావిస్తున్నారు. ఇక బీజేపీ కూడా ఈ సీటుపై ఆశలు పెంచుకుంది. సెమీ అర్బన్ కావటం, దీనికితోడు అతిపెద్ద పారిశ్రామిక ఏరియాగా గుర్తింపు పొందింది పటాన్ చెరు. ఇక్కడ ఉత్తరాధి రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉండే కార్మికులు ఇక్కడ నివాసం పొందుతున్నారు. స్థానికంగా ఉండే కంపెనీలలో పని చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో... వీరి ఓట్లపై కూడా కమలదళం ఆశలు పెట్టుకుంది. గత ఎన్నికల్లో కరుణాకర్ రెడ్డి పోటీ చేయగా... ఈసారి కూడా బరిలో ఉండాలని చూస్తున్నారు. అయితే 2014లో బీజేపీ రెబల్ గా పోటీ చేసిన అంజిరెడ్డి కూడా...ఈసారి పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కూడా బీజేపీలో ఉన్నారు. ఈ మధ్యనే పార్టీలో బీఆర్ఎస్ కోవర్టులు ఉన్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో.... ఆయన పార్టీని వీడుతారనే చర్చ జోరందుకుంది. ఒకవేళ ఆయన కాంగ్రెస్ లోకి వెళ్తే.... పటాన్ చెరు పాలిటిక్స్ పీక్స్ కు చేరినట్లు అవుతుంది.ప్రధాన పార్టీలన్నింటిలోనూ టికెట్లు ఆశిస్తున్న అభ్యర్థులు ఇద్దరికి పైగా ఉండటంతో ఈసారి టికెట్ ఎవరికి రాబోతుందనేది మాత్రం ఆసక్తికరంగా మారింది. టికెట్ దక్కించు కున్నప్పటికీ.... ఓటర్ల మనసును గెలిచే నేత ఎవరనేది టాక్ ఆఫ్ ది పటాన్ చెరుగా మారిపోయింది. ఇక బీఎస్పీ, వైఎస్ఆర్టీపీతో పాటు మిగతా పార్టీలు కూడా పోటీకి సన్నద్ధం అవుతున్నాయి. మొత్తంగా గెలుపు లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్న నేపథ్యంలో... విజయం ఎవర్ని వరిస్తుందనేది చూడాలి...!

# మాగుంట రాఘవ్ మధ్యంతర బెయిల్ రద్దు

**న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు:** ఢిల్లీ లిక్కర్ స్కాంలో మాగుంట రాఘవకు ఢిల్లీ హైకోర్టు మంజూరు చేసిన పదిహేను రోజుల మధ్యంతర బెయిల్ ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. పన్నెండో తేదీన ఆయన సరెండర్ కావాలని ఆదేశిచింది. తన అమ్మమ్మకు ఆరోగ్యం బాగో లేదనందున బెయిల్ కావాలని రాఘవ పిటిషన్ వేశారు. ఈ మేరకు పదిహేను రోజుల మధ్యంతర బెయిల్ ను దిగువకోర్టు ఇచ్చింది. అయితే ఈడీ వెంటనే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. మాగుంట రాఘవ బెయిల్ పై బయట ఉంటే సాక్షుల్ని ప్రభావితం చేస్తారని.. సాక్ష్యాల్ని తారుమారు చేస్తారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ పై విచారణ తర్వాత సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది.బెయిల్ రద్దుపై విచారణలో మాగుంట రాఘవ తరపు న్యాయవాది.. కీలక విషయాలు వెల్లడించారు. మాగుంట రాఘవ భార్య కూడా గతంలో ఆత్మహత్యాయత్నం చేసిందని చెప్పారు. అందువల్ల ఆమె కూడా రాఘవ అమ్మమ్మ ఆరోగ్యాన్ని చూసుకునే అవకాశం లేదన్నారు. అయితే.. గతంలో తన భార్య అనారోగ్యమని బెయిల్ పిటిషన్ వేశారని.. అక్కడ ఊరట లభించకపోయే సరికి అమ్మమ్మ అనారోగ్యం పేరుతో మరో పిటిషన్ దాఖలు చేశారని ఈడీ తరపు న్యాయవాదులు సుప్రీంకోర్టులో వాదించారు. ఇప్పుడు రాఘవ బెయిల్ పై విడుదలయ్యారా అని ధర్మాసనం ప్రశ్నించింది. అవునని ఆయన బెయిల్ రాగానే.. జైలు నుంచి విడుదలై.. నెల్లూరుకు వెళ్లారని లాయర్లు చెప్పారు. అందుకే పన్నెండో తేదీ లోపు సరెండ్ కావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మాగుంట రాఘవ ఢిల్లీ లిక్కర్ స్కాంలో కీలక పాత్ర పోషించారని ఈడీ ఆరోపిస్తోంది. బాలాజీ గ్రూపు యజమానిగా ఉన్న మాగుంట రాఘవకు... ఇండో స్పిరిట్ కంపెనీలో భాగస్వామ్యం ఉందని ఈడీ చార్జిషీట్లలో కోర్టుకి తెలిపింది. రాఘవరెడ్డిని ఈ కేసులో కీలక వ్యక్తిగా ఈడీ చూపించింది. 180 కోట్ల నేరపూరిత ఆర్థిక లావాదేవీల్లో రాఘవరెడ్డి పాత్ర ఉందని ఈడీ తెలిపింది. ఇండో స్పిరిట్ కంపెనీలో రాఘవరెడ్డిని భాగస్వామిగా చూపించింది. మరోవైపు మాగుంట ఆగ్రో ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రెండు రిటైల్ జోన్స్ కూడా ఉన్నాయని ఈడీ ప్రకటించింది. మద్యం విధానంతో లబ్ది పొందేందుకు ముడుపులు ఇచ్చారని... ముడుపులను హవాలా మార్గంలో చెల్లించారని తెలిపింది. ఇప్పటికే దాఖలు చేసిన చార్జ్ షీట్లలో వివరాలు పొందుపరచామని పేర్కొంది. సుమారు 30 మంది సాక్షుల వాంగ్మూలం కూడా నమోదు చేశామని వివరించింది. ఇండో స్పిరిట్ కంపెనీ నుంచి రాఘవ మాగుంటకు వాటా వెళ్తోందని ఈడీ చార్జిషీట్లో పెర్కొంది. ఢిల్లీ లిక్కర్ వ్యాపారంలో సౌత్ గ్రూప్ పేరిట చక్రం తిప్పడంలో పలువురు ప్రముఖులు కీలక పాత్ర పోషించారని, వ్యాపార ప్రయోజనాలు పొందడానికి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తోంది. ఇప్పటికే దాఖలు చేసిన ఛార్జిషీట్లలో పలువురి పేర్లను ప్రధానంగా ప్రస్తావించింది. ఢిల్లీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను కూడా ఓ సారి ప్రశ్నించారు. పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రమేయం గురించి ఈడీ పలుమార్లు విచారణ జరిపింది.

# శంషాబాద్ పరిధిలో మహిళను హత్య చేసిన పూజారి



**రంగారెడ్డి - ప్రభాతసూర్యుడు :** శంషాబాద్‌లో ఒక మహిళ హత్యకు గురయింది. ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న పూజారే మహిళను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో మహిళను పూజారీ హత్య చేసాడు. నిందితుడఇకి ఇదివరకే పూజారికి వివాహమై ఇద్దరు పిల్లలు వున్నారు. తాజాగా ఆమెను కారులో ఎక్కించుకొని వచ్చి శంషాబాద్ పరిధిలోని నర్కుడ వద్ద తలపై రాయితో మోది హత్య చేసాడు. అనంతరం మహిళా మృతదేహాన్ని కవర్ లో కట్టి కారులో తీసుకెళ్లి సరూర్ నగర్ లోనే మ్యాన్ హోల్ లో పడేసాడు. ఆ తర్వాత ఏమి ఎరగనట్లు మహిళ కనిపించడం లేదని ఆర్ జి ఐ ఏ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి అసలు విషయాలు బయటకు రాబట్టారు. మూడు రోజుల క్రితం మహిళ ను హత్య చేసిన పూజారి వెల్లడించాడు. నిందితుడు వెంకట సాయి సూర్య కృష్ణ, మృతురాలి పేరు అప్సర.

# రామాయంపేటలో బంద్ ప్రశాంతం

**మెదక్ - ప్రభాతసూర్యుడు :**

మెదక్ జిల్లా రామాయంపేటను రెవెన్యూ డివిజన్ డిమాండ్ చేస్తూ 48 బంద్కు పిలుపునిచ్చింది అఖిలపక్షం. దీంతో పట్టణంలోని వాణిజ్య వ్యాపార సంస్థలన్నీ స్వచ్ఛందంగా మూసివేశారు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్ చేయాలంటూ నాలుగేళ్లుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం నుండి ప్రకటన రాకపోవడంతో 48 గంటల బంద్కు పిలుపునిచ్చారు అఖిలపక్ష నేతలు. ప్రస్తుతం బంద్ ప్రశాంతంగా కొనసాగింది.

# ట్యాంకర్ ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..

## 20 మందికి గాయాలు

**నల్గోండ- ప్రభాత సూర్యుడు :** నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలం ఏపీ లింగోటం శివారులో జాతీయ రహదారిపై చెట్లకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న 20 మందికి గాయాలయ్యాయి. అందులో నలుగురు పరిస్థితి విషమంగా వుంది. క్షతగాత్రులను నార్కట్ పల్లి కామినేని హాస్పిటల్ కు తరలించారు. కోదాడ డిపోకు చెందిన బస్సు హైదరాబాద్ నుండి కోదాడకు వెళుతుండగా ఘటన జరిగింది. ప్రమాదసమయంలో బస్‌లో 43 ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు.

## నాంపల్లిలో

# చేప ప్రసాదం పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

సరిపడా ఏర్పాట్లు చేసింది. మూడేళ్ల విరామం తర్వాత ఈ ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. అందుకే భారీగా గురువారమే ప్రజలకు తరలి వచ్చారు. దీంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. తెలుగు రాష్ట్రాలతోపాటు వేర్వేరు రాష్ట్రాల నుంచి కూడా జనం తరలి వచ్చారు. ఇంకా వస్తున్నారు. భారీగా తరలి వస్తున్న వేళ అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలకు సమస్యలు రాకుండా ఉండేందుకు స్వచ్ఛంద సంస్థల సాయం కూడా పోలీసులు తీసుకుంటున్నారు. చేప ప్రసాదం కోసం భారీ సంఖ్యలో జనం రావడంతో గురువారం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ అర్థరాత్రి వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ఎంజే మార్కెట్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్ వైపు వెళ్లే వెహికల్స్?ను అబిడ్స్ జీపీవో, నాంపల్లి స్టేషన్? మీదుగా పోనిస్తారు. బేగంబజార్ ఛత్రి, ఎంజే బ్రిడ్జి నుంచి నాంపల్లి వైపు వచ్చే వెహికల్స్?ను దారుసలాం, ఏక్ మినార్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. అసెంబ్లీ జంక్షన్ నుంచి నాంపల్లి స్టేషన్, అఫ్జల్‌గంజ్ వైపు వచ్చే వెహికల్స్ ను బషీర్?బాగ్ ?ఏఆర్ పెట్రోల్ ?పంప్, బీజేఆర్ విగ్రహం మీదుగా డైవర్ట్ చేస్తున్నారు. చేప ప్రసాదం తీసుకునేందుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు పోలీసులు. నాంపల్లిలోని గృహకల్ప, గగన్ విహార్, చంద్రవిహార్, ఎంఏఎం గర్ల్స్ జూనియర్ కాలేజీ, ఇంటర్ బోర్డు వద్ద వాహనాలు పార్క్ చేసుకోవచ్చు. భారీ వాహనాలను మాత్రం గోషామహల్ పోలీస్ స్టేడియంలో పార్క్ చేయాలి. బైక్?లను భీమ్ నగర్, గృహకల్ప, బీజేపీ ఆఫీస్ వద్ద మాత్రమే పార్క్ చేయాలి. పాస్‌లు ఉన్న వీఐపీలు తమ వాహనాలను సీడబ్ల్యూసీ గోడౌన్స్ పార్కింగ్ ఏరియాలో ఉంచాలి. మూడేళ్ల తర్వాత భారీ ఎత్తున చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు చేయూత అందిస్తున్నాయి. ప్రసాదం తీసుకోవడానికి వచ్చిన ప్రజలకు టిఫెన్స్, భోజనలు, మంచినీళ్లు, మజ్జిగను అందిస్తున్నాయి. తెలంగాణ ఆరోగ్య శాఖ హెల్త్ క్యాంపులను కూడా ఏర్పాటు చేసింది. అంబులెన్స్‌లు కూడా అందుబాటులో ఉంచింది. ఎలాంటి సమస్య ఉన్నా కంట్రోల్‌రూమ్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు పోలీసులు .

## జడ్పీ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ దేవదాస్ గౌడ్ తదితరలు

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కవాడి పల్లి గ్రామంలో 4,40,000 రూపాయల జడ్పీ నిధులతో శుక్రవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మండల జడ్పీటిసి బింగి దేవదాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవదాస్ గౌడ్ మాట్లాడుతూ.. అంచలంచెలుగా మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ దూసరి సుజాత యాదయ్య, వార్డు మెంబర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీ ఢీకొని నూతన దంపతులు మృతి



**మహబూబాబాద్ - ప్రభాత సూర్యుడు**

అతివేగం ఓ నూతన దంపతుల ప్రాణాలు తీసిన ఘటన మరిపెడ మండల పరిధిలో చోటుచేసుకుంది.మరిపెడ పోలీసుల వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచెర్ల గ్రామ పరిధిలోని పెట్రోల్ బంకు సమీపంలో హైదరాబాదు నుండి మండల కేంద్రానికి యమహా బైక్ పై వస్తున్న తునగరి.నారాయణ(27) అతని భార్య అంజలి(22)లను ఎదురుగా వస్తున్న ఖాళీ ఇసుక లారీ ఢీకొనడంతో స్పాట్లోనే భార్యాభర్తలిద్దరూ చనిపోయారు. ఇదిలా ఉండగా అంజలికి గత రెండు నెలల క్రితం వివాహం జరగడం భర్త హైదరాబాదులో సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పని చేస్తూ ఉండటం అత్తగారింటికి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరగడంతో బంధువులు మునిగిపోయారు. ఇసుక వ్యాపారంతో లారీలు ఇస్తారు వేగంగా వెళుతూ ఉండడం పలుమార్లు ప్రమాదాలు జరుగుతూ ఉండడం ప్రజలు ప్రాణాలు పోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## తల్వార్లు, రాడ్లతో దాడి... ఇద్దరికి తీవ్ర గాయాలు

**రంగారెడ్డి - ప్రభాత సూర్యుడు**



రాజేంద్రనగర్ సులేమాన్ నగర్ లో ఒక కుటుంబం రెచ్చి పోయింది. తల్వార్లతో , రాడ్ల తో మరో కుటుంబ పై దాడి చేసయడంతో ఇద్దరు యువ కులు తీవ్రంగా గాయపడ్డారు. అడ్డు వచ్చిన వారిపై దాడి జరిగింది. ఇద్దరిలో అందులో ఒకరి పరిస్థితి విషమం గావుంది. తల్వార్లతో, రాడ్ల తో విచక్షణారహితంగా దాడి చేసిన కుటుంబం, జోలికి వస్తే చంపుతామని బెదిరింపులకు దిగింది. గాయపడిని వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మేకలు తమ కార్లు పై ఎక్కి పాడు చేస్తున్నాయి. వాటిని ఓ స్థలంలో కట్టుకొండి అన్న పాపానికి దాడి జరిగింది. బాధితులు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్యాంకర్ బోల్తా..పరారీలో డ్రైవర్

**ఖమ్మం - ప్రభాత సూర్యుడు**

ఖమ్మం నగరంలో ఒక ట్యాంకర్. విద్యుత్ స్తంభం ను ఢీ కొట్టి బోల్తా కొట్టింది. ట్యాంకర్ బోల్తా కొట్టే విజువల్స్ సి.సి కెమెరా లో రికార్డ్ అయ్యాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లోని పులివెందులకు వెళ్తున్న ఏ.పి39యుఈ0022 నంబర్ గల ట్యాంకర్ మణుగూరు లో బూడిదను నింపుకొని జగ్గయ్యపేట వెళ్లేందుకు ఖమ్మం నగరం లోనుంచి వెళ్తుండగా బోనకల్ క్రాస్ రోడ్డు లోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే డ్రైవర్ నిద్ర మత్తులో ఉండి కరెంట్ స్తంభం ను ఢీ కొట్టాడు.దీంతో ఒక్కసారిగా ట్యాంకర్ బోల్తా పడింది.బోల్తా పడిన వెంటనే డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. ప్రమాద సమయములో ఎవ్వరూ లేకపోవడముతో ప్రాణనష్టం తప్పింది. ట్యాంకర్ విద్యుత్ స్థంభాన్ని ఢీ కొట్టడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అలా కాకుండా పెట్రోల్ బంక్ లోకి దూసుకెళ్తే ఘోర ప్రమాదం జరిగి ఉండేది.

## అర్ధరాత్రి బీజేపీ నేత అరెస్టు

**మేడ్చల్ - ప్రభాత సూర్యుడు**

మల్కాజిగిరి లో గురువారం అర్ధరాత్రి అల్వాల్ పోలీసులు హల్చల్ చేసారు. బిజెపి యువ మోర్చా నాయకుడు పక శివ ఇంటికి అర్ధరాత్రి చేరుకున్న అల్వాల్ పోలీసులు, శివను అరెస్ట్ చేయడానికి పోలీసులు ప్రయత్నం చేసారు. మల్కాజిగిరిలో జరగనున్న టీం సాయి ఆధ్వర్యంలో నిర్వహించే స్పోర్ట్స్ ఉత్సవ్ ఆపే ప్రయత్నం అని టీం సాయి సభ్యులు చెబుతున్నారు. పోలీసులు తీరును బీజేవైఎం జాతీయ కోశాధికారి పి.ఎం సాయి ప్రసాద్ మరియు స్థానిక యువ మోర్చా నాయకులు ఖండించారు.

## హనుమంతుని గుడి లేని ఊరు లేదు..
# కేసీఆర్ సంక్షేమ పథకం అందని ఇల్లు లేదు

- ఘనంగా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సంక్షేమ దినోత్సవం
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాట్లాడుతూ...

**ఇబ్రహీంపట్నం - ప్రభాత సూర్యుడు**

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సంక్షేమ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్ లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నిర్వహించిన తెలంగాణ సంక్షేమ సంబరాల కార్యక్రమం సభలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో హనుమంతుని గుడి లేని ఊరు లేదు, కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని కొనియాడారు. ప్రతీ ఇంట్లో ఏదో ఒక సంక్షేమం అందుతుందని, ప్రతీ ఒక్క గడపకు కేసీఆర్ ప్రభుత్వ పథకం చేరుతుందని అన్నారు. నియోజకవర్గంలో ప్రతినెల 6,91,03,000 రూపాయల నిధులతో వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, చేనేత కార్మికుల పెన్షన్లు అందుతున్నాయని, గత తొమ్మిది సంవత్సరాలలో 452.52 కోట్ల రూపాయల పెన్షన్లు అందాయని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా లబ్ది పొందారని అన్నారు. అనంతరం నియోజకవర్గానికి చెందిన 100 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులు, ఆరుగురు బీసీలకు కులవృత్తి సాయం చెక్కులు, ముగ్గరికి కులాంతర వివాహ ఇంటర్ స్కీమ్ చెక్కులు, మరో ముగ్గరికి విదేశాలకు వెళ్లే విద్యార్థులకు సాయంగా అంబేడ్కర్ ఓవర్ సిస్ స్కాలర్ షిప్ చెక్కులు (20లక్షల చొప్పున) మరియు ఆసరా పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తాపూర్ చంద్రయ్య, ఎంపిపిలు కృపేష్, నర్మదా, జడ్పిటిసీ జంగమ్మ, ఎమ్మార్వోలు, ఎంపిడిఓలు, ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయండి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రా చారి



కొత్తగూడెం బహిరంగ సభ గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

**అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు**

ఈ నెల 11న కొత్తగూడెంలో జరిగే సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, హయత్ నగర్ మండలం ఉమ్మడి కమిటీలు ముత్యాల యాదిరెడ్డి, సామిడి శేఖర్ రెడ్డి పబ్బతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కుంట్లూరు గ్రామ పరిధి భూ పోరాట కేంద్రం రావి నారాయణరెడ్డి కాలనీ ఫేస్ -3లో కొత్తగూడెం బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరుతూ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్ర చారి మాట్లాడుతూ.. రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ, యువజన మహిళా లోకం చైతన్య పరిచేలా, రైతు కష్టాలను అదిగమించి ప్రజా పోరాటలు నిర్మించేలా కొత్తగూడెం సిపిఐ బహిరంగ సభ ఉంటుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో సిపిఐ విధానాలు ప్రకటించేందుకు నిర్ణయం జరుగుతుందని తెలిపారు. ఈ కొత్తగూడెం బహిరంగ సభను విజవంతం చేయుటకు పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు వేలాదిగా తరలి రావాలని రవీంద్ర చారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐ టీయూసీ జిల్లా నాయకులు అజ్మీర్ హరి సింగ్ నాయక్, దిగోజు వేణుగోపాల చారి, పొన్నాల యాద గిరి, కేతరాజు నరసింహ, ఏశాల నరసింహ, దాసరి ప్రసాద్ నారాయణ, కాటి అరుణ, వట్టి నవనీత, సక్రు నాయక్, పుల్లయ్య సుభద్ర, సరిత, సుజాత దేవమ్మ, సౌజన్య, నిరంజన్, బిక్షపతి నారాయణరెడ్డి, మధు, సుధాకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
# చెరువుల అభివృద్ధి గురించి మాట్లాడం హాస్యాస్పదం

- బిఎస్పి ఎల్బీనగర్ ఇంచార్జ్ జక్క యాదగిరి



ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

**ఎల్బీనగర్ - ప్రభాత సూర్యుడు**

కబ్జాకు గురవుతున్న చెరువులను కాపాడలేని ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి చెరువుల అభివృద్ధి గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని బిఎస్పి పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ జక్కా యాదగిరి ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం హయత్ నగర్ లోని బాతుల చెరువు వద్ద నిర్వహించిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి చెరువుల అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని బీఎస్పీ నాయకుడు జక్కా యాదగిరి ఒక ప్రకటనలో అన్నారు. 11 సంవత్సరాల కక్రితం హస్తినాపురంలో ఉన్న చేపల చెరువు ని కబ్జా చేసిన ఘనత సుధీర్ రెడ్డికే దక్కుతుందని ఆరోపించారు. చేపల చెరువు కబ్జాకు గురికావడం వల్ల, సాగర్ రింగ్ రోడ్డు, బైరమల్ గూడ లోని లోతట్టు ప్రాంతాలు ఇప్పటికీ జలమలమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో ఎన్ని చెరువులు ఉన్నాయో, అవి ఎంత విస్తీర్ణంలో ఉన్నాయా చెప్పగలరా అని ప్రశ్నించారు. నిజంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఎల్బీనగర్ నియోజక వర్గం పరిధిలో ఉన్న చెరువుల సరిహద్దులను గుర్తించి వాటికి కంచెలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. 45 కోట్ల రూపాయల నిధులతో చెరువులను అభివృద్ధి పరిచామని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడే విధానం చూస్తుంటే కంచే చేను మేసిన చందంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి కట్ల కుమార్, కె అనిల్, ఎ స్వామి, జి.శేఖర్, మహేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతమేశ్వర గోశాలకు 50 కట్టల పచ్చ గడ్డి అందజేత

**మంథని - ప్రభాత సూర్యుడు**



మంథని పట్టణంలోని శ్రీ గౌత మేశ్వర గోశాల కు 50 కట్టల పచ్చ గడ్డిని ఏఎమ్ఆర్ ఇండియా లిమిటెడ్ తాడిచెర్ల కోల్ బ్లాక్ ఓపెన్ కాస్ట్ మైన్ జిఎం ఏ ప్రభాకర్ రెడ్డి, సూపర్వైజర్ అమర్నాథ్ రెడ్డి లు శుక్రవారం అందించి మానవ త్వాన్ని చాటుకున్నారు. మంథని పట్టణంలో నిర్వహిస్తున్న శ్రీ గౌత మేశ్వర గోశాలలో గో గ్రాసం లేక ఇబ్బంది పడు తుందన్న విషయాన్ని తెలుసు కొన్న ఏఎమ్ఆర్ ఇండియా లిమిటెడ్ తాడిచెర్ల కోల్ బ్లాక్ ఓపెన్ కాస్ట్ మైన్ జిఎం ఏ ప్రభాకర్ రెడ్డి, సూపర్వైజర్ అమర్నాథ్ రెడ్డి లు స్పందించారు. వెంటనే వాహనం ద్వారా గోశాలకు దాదాపు 5వేల రూపాయల విలువ చేసే 50 కట్టల పచ్చ గడ్డిని అందించి మూగజీవాల ఆకలి తీర్చారు. వారికి శ్రీ గౌతమేశ్వర గోశాల తరఫున గౌతమేశ్వర గోశాల చైర్మన్ ఆకుల స్రవంతి విద్యాసాగర్ ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215